క్లుప్తంగా

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



తెనాలి రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ ఈ నెల 2న తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లోని విజయవాడ్ బుకింగ్ కౌంటర్ వద్ద అపస్మారకస్థితిలో ఉండడాన్ని ప్రయాణికులు గమనించారు. 108 అంబులెన్సుకు సమాచారమిచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు పంపగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న పిల్లలకు ధ్యానంలో ఉచిత శిక్షణ

తెనాలి టౌన్: దసరా పండుగ సందర్భంగా శ్రీ ఆంజనేయం ధ్యానయోగ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి 21 వరకు చిన్న పిల్లలకు ధ్యానంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చిల్డ్రన్స్ యోగా కన్వీనర్ కూరపాటి నాగరాజు శుక్రవారం తెలిపారు. గంగానమ్మపేటలోని చుండూరువారి సత్రం ప్రాంగణంలో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ధ్యానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9440712208లో సంప్రదించాలని కోరారు.

బాలింతలకు పండ్లు, రొట్టెల పంపిణీ



తెనాలి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ సభ్యుడు జి.వి.నారాయణ కుమారుడు పూర్ణచంద్ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు జి.వెంకటరత్నం, శంకరయ్య, తిరుపతయ్య, సురేష్‌కుమార్‌జైన్, ప్రతాప్, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల సేవ



తెనాలి అర్బన్: బోసు రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొండపి వసుంధర ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సత్యనారాయణస్వామి ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అందె రాజేశ్వరి, కనకదుర్గ, సీహెచ్.నాగమల్లేశ్వరి, రత్నకుమారి, చిరంజీవి, నరసింహ, కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు సూరేపల్లి విద్యార్థిని



సూరేపల్లి(భట్టిప్రోలు): వేజండ్ల హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాలీబాల్ పోటీలలో సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న సీహెచ్. మాధవి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైంది. శనివారం నుంచి కడపలో నిర్వహించనున్న అండర్-17 వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసశర్మ తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ జీఎస్ నాగేశ్వరరావు, ప్రతిభ చూపిన మాధవిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాజకు చెందిన అంబటి కల్యాణ్ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో స్టోర్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. రోజూ లాగానే శుక్రవారం ద్విచక్ర వాహనంపై వచ్చి స్టాఫ్ పార్కింగ్‌లో పార్క్ చేసి విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా వాహనం కనపడకపోవడంతో చోరీకి గురైందని భావించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ ఫుటేజీను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు ఆరోగ్య సురక్ష వరం



కొత్తపేట శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగులు



కొత్తపేట శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ఎమ్మెల్యే శివకుమార్

బొమ్మువానిపాలెం(కొల్లిపర): దేశంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మండలంలోని బొమ్మువానిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని అన్నవరపులంక విలేజ్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య రక్షణ, భరోసా కల్పించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల్ని ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో ప్రజలు ఉపయోగించుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి, రోగుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ అన్ని వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తుమాటి భీమారాణి, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, నాయకులు బొమ్ము శ్రీనివాసరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, బూరెల దుర్గాప్రసాద్, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.



అన్నవరపులంక వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



అన్నవరపులంక శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

తెనాలి టౌన్: రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ మెరుగైన ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రజల ఆరోగ్య సంరక్షణకు అక్కడి ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి ప్రతి వ్యక్తికీ మెరుగైన ఆరోగ్యం అందించే దిశగా హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45రోజుల పాటు సురక్ష హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తారని, ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

శిబిరానికి విశేష స్పందన

ఒకటి నుంచి 11వార్డులకు చెందిన సచివాలయాల పరిధిలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవల్ని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమా, మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంహెచ్‌వోలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



నూతక్కి విద్యార్థులు

మంగళగిరి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి, నిడమర్రు జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కట్టెపోగు మహేంద్ర ఇటీవల వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నూతక్కి రవి తెలిపారు. బాలికలు ఎస్‌కె బషీరున్నీసా, దాసరి కీర్తిలు రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా నూతక్కి సంతోష్‌కుమార్ బాలుర జట్టుకు ఎంపికయ్యాడు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేవేంద్రపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎంపిక

తాడేపల్లి రూరల్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.సంతోష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీ చేబ్రోలు మండలం వేజెండ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు ఎంపికల్లో రేవేంద్రపాడు విద్యార్థి జి. సంతోష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలియజేశారు. కడపలో ఈ నెల ఏడో తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. సంతోష్‌ను విద్యా కమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాష్‌రావు, పీడీ మల్లంపూడి రవి, గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ అభినందించారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన జి.సంతోష్

మహిళలను మహరాణులను చేసిన ఘనత సీఎం జగన్‌దే

రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

మంగళగిరి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా మహిళల ఖాతాలలో జమచేసి మహరాణులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. నగరంలోని ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు లీడర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొలుత నగర పరిధిలోని ఆత్మకూరు, చినకాకాని, కాజలలో పర్యటించి పాఠశాలలు, సచివాలయాలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో నాగార్జునరెడ్డి మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాలు గురించి మహిళలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విలియమ్స్, ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

కరాటేలో వీఐటీ-ఏపీ విద్యార్థికి బంగారు పతకాలు



వినయ్‌ను అభినందిస్తున్న వీఐటీ ఏపీ వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్, డీడీ తదితరులు

ఐనవోలు(తాడికొండ): ద్వితీయ సౌత్ ఇండియన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో తమ విశ్వవిద్యాలయానికి చెందిన బీ-టెక్ 3వ సంవత్సరం విద్యార్థి కె వినయ్ రెండు బంగారు పతకాలు సాధించారని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీన రాజమండ్రిలో జరిగిన 2వ సౌత్ ఇండియన్ చాంపియన్‌షిప్‌లో కరాటేలోని కాటా, కుమితే విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి కె వినయ్‌ను రెండు బంగారు పతకాలు వరించడం అభినందనీయమన్నారు. కరాటేలో గోల్డ్ మెడల్ అంటే చిన్న విషయం కాదని, ప్రతిభ కలిగిన విద్యార్థులను విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందనేందుకు ఈ విజయాలే నిదర్శనమన్నారు. విద్యార్థి వినయ్‌ను వీసీతోపాటు రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర, స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రరావు అభినందించారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



వెల్లటూరు(భట్టిప్రోలు): రైతులు రసాయన ఎరువులు వాడకుండా.. కషాయాలు తయారు చేసుకుని పంట సాగులో వాడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. వెల్లటూరు రాధాకృష్ణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరిలో సుడిదోమకు తూటికాడ కషాయం, ఆకు ముడత పురుగు నివారణకు వెల్లుల్లి, పచ్చిమిర్చి కషాయం తయారు చేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ-1 శివనాగేశ్వరమ్మ, నిర్వాహకులు రేవతి, శ్రీనివాసరావు, రామయ్య, ఇస్మాయిల్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

తెనాలి రూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ శాలిపేటకు చెందిన కొత్త రమేష్ ఈ నెల 1వ తేదీ రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపారు. మర్నాడు ఉదయం నిద్రలేచి చూడగా వాహనం కనబడలేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో వన్‌టౌన్ పోలీసుల్ని శుక్రవారం ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రసాయన రహిత కూరగాయలతో ఆరోగ్యం

తూములూరు (కొల్లిపర): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రతి మహిళ తన ఇంటి ఖాళీ స్థలంలో సూర్య మండలి మోడల్ పద్ధతిలో రసాయన రహిత ఆకుకూరలు, కూరగాయలు పండించాలని హెల్త్ అండ్ న్యూట్రిషన్ నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ ఎం. నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని తూములూరులో మహిళలకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్య పోషణ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఇంటి పెరటిలో రసాయన రహిత కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు తినడం ద్వారా పోషకాలు మెండుగా లభించి, కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మిగిలిన కూరగాయల్ని గ్రామంలో అమ్ముకోవడం వల్ల ఆర్థికంగా ఎదుగుదల కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం సూర్య మండలం తయారీ, విత్తనాలు నాటుకునే విధానం తదితర అంశాల్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ దూసరి రాజకుమారి, డ్వాక్రా సంఘం సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వేమన పద్యానికి అద్భుత రూపం

తాడేపల్లిరూరల్: నులకపేటకు చెందిన చిత్రకారుడు గర్నెపూడి కల్యాణ్‌కుమార్ వేమన విద్యాకేంద్రం, తిరుపతి శ్రీ కళాక్షేత్రం వారు సంయుక్తంగా నిర్వహించిన ఫైన్ ఆర్ట్స్ విభాగంలో వేమన పద్య భావనా చిత్రకళా పోటీల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. వేమన పద్యాలలో ఒకటైన నీళ్లలోన మీను నిగిడి దూరం పారుకి అర్థం వచ్చేటట్లు గర్నెపూడి కల్యాణ్ ఫైన్ ఆర్ట్ వేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అక్టోబర్ 29వ తిరుపతిలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కల్యాణ్ బహుమతి అందుకోనున్నారు. నులకపేట వాసులు కల్యాణ్‌కు అభినందనలు తెలియజేశారు.

చిత్ర కళ పోటీలలో వడ్డేశ్వరం విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్ర కళా పోటీలలో ప్రతిభ కనబరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు శుక్రవారంమాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళ అకాడమి నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో రామాయణం అనే అంశంపై వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. 10వ తరగతి విద్యార్థిని ఎస్.శిరీష కాంస్య పతకం సాధించిందని, 12 మంది విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారని వివరించారు. విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో చిత్రకళా ఉపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు జోజప్ప, బుజ్జిబాబు, సుందరరాజు, పద్మావతి, జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

నీతి, నిజాయతీకి ప్రతిరూపం జీవీఆర్

ఎమ్మెల్యే శివకుమార్



జీవీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ , పార్టీ నాయకులు

కొల్లిపర: నీతి, నిజాయతీ గల వ్యక్తి దివంగత మాజీ దుగ్గిరాల ఎమ్మెల్యే గుదిబండి వెంకటరెడ్డి (జీవీఆర్) అని తెనాలి శాసనసభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. కొల్లిపర ప్రధాన కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద , వెంకటరెడ్డి స్వగృహంలో శుక్రవారం 7వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1989 నుంచి 2004 వరకు దుగ్గిరాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వరుసగా నాలుగు పర్యాయాలు విజయం సాధించిన ఏకైక నాయకుడు గుదిబండి వెంకటరెడ్డి అని కొనియాడారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాల్ని గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమవరపు శివకోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఝాన్సీ, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, జొన్నల శివారెడ్డి, కళ్లం వీరారెడ్డి, అన్నవరపు రమేష్, చెంచల రామిరెడ్డి, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, అవుతు బ్రహ్మారెడ్డి , ఏ. కృష్ణారెడ్డి తదితరులు గుదిబండి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

తెనాలి రూరల్: తెనాలిలోని ది హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా చుండూరి నాగమల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా దేవతి తులసీ ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా దేసు యుగంధర్, సంయుక్త కార్యదర్శిగా పచ్చిపులుసు రామ్మోహనరావు, కార్యవర్గ సభ్యులుగా చుండూరి సత్యనారాయణ, ఇడపలపాటి హరిప్రసాద్, గోళ్ల కాశీవిశ్వనాథం, యన్నమూరి వెంకటేశ్వర్లు, కనికచర్ల శ్రీతల్ప సాయి మణికంఠ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యుల్ని పలువురు వ్యాపారులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

సమస్యలను పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒత్తిడితో జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు అని ప్రముఖ వైద్యుడు డాక్టర్ వి.వి. రవికుమార్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నవ్వండి -సంతోషంగా ఉండండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో మనస్సుకు, శరీరానికి మంచి ఔషధం నవ్వు మాత్రమేనని పేర్కొన్నారు. సినీ దర్శకుడు జంధ్యాల చెప్పినట్టు నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఆర్. జయ శైలజ, సురేష్, స్వామి, కుమార్ రాజా, కె. శ్రావణి,విద్యార్థులు పాల్గొన్నారు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: హాస్యం ఆప్తమిత్రుని వంటిదని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి రామ్‌కుమార్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రపంచ నవ్వుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. హాస్యం గొప్ప ఔషధంతో పాటు ఆరోగ్యదాయిని, ఆనందదాయినిగా పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య రచయిత బి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలా చేటు అనేది పాత మాటనీ, నవ్వు నాలుగు విధాల గ్రేటు నేటి మాటని తెలిపారు.

నాయకుల దిగజారుడు వ్యాఖ్యలు తగదు

ఇటీవల కొందరు నాయకుల వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు శృతి మించి పోతున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఖండించారు. అసభ్యకర విమర్శలు, తిట్ల పురాణాలు సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సౌదీ కరెన్సీ పేరుతో మోసం

గుంటూరు ఈస్ట్: సౌదీ కరెన్సీ పేరుతో మోసం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందపేటకు చెందిన సయ్యద్ షంషీద్‌కు కొన్ని నెలల కిందట కృష్ణబాబునగర్‌లో నివసించే కలకత్తాకు చెందిన రాజు పరిచయమయ్యాడు. తన దగ్గర సౌదీ కరెన్సీ ఉందని చెప్పడంతో షంషీద్ గత నెల 24న రాజు వద్దకు వెళ్లి రూ. 4.50 లక్షలు ఇచ్చాడు. అందుకు రాజు కవర్‌లో చుట్టి ఉంచిన నోట్ల కట్టను షంషీద్‌కు ఇచ్చాడు. రూ. 4.50 లక్షల్ని ఇంట్లో పెట్టి వస్తానంటూ చెప్పి రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత షంషీద్ కవర్ విప్పి చూడగా నోట్ల కట్టలో పైభాగంలో ఆరు సౌదీ కరెన్సీ నోట్లు మాత్రమే ఉన్నాయి. మిగిలినవి తెల్ల కాగితాలు ఉన్నాయి. షంషీద్ తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

వృద్ధురాలిని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంజనేయపేటకు చెందిన తులసమ్మకు పలు కారణాల రీత్యా పెద్దమొత్తంలో డబ్బులు వచ్చాయి. ఆమె మనవడి స్నేహితుడు కంకణాల రహీం అకౌంట్‌లో మార్చిలో రూ. 10 లక్షలు వేసింది. అనంతరం ఆ డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని రహీంను కోరగా అతను వాయిదా వేస్తూ వచ్చాడు. చివరకు మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను బెదిరించి నగదు, బైక్‌తో పరారీ

మహిళను అడ్డుకుని బెదిరించి ద్విచక్ర వాహనం, డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

పిచుకలగుంట ప్రాంతంలో నివాసం ఉండే ఊటుకూరి డేవిడ్‌కు ఓ మహిళతో పరిచయం ఉంది. కొన్ని నెలలుగా ఆమె అతడితో విభేదించి దూరంగా ఉంటోంది. ఈనెల 4న రాత్రి మహిళ ద్విచక్ర వాహనంపై ఠాగూర్ బొమ్మ ప్రాంతంలో వెళుతున్న సమయంలో డేవిడ్ అడ్డుకున్నాడు. ఆమెను బెదిరించి రూ. 10వేలు, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం లాక్కొని పారిపోయాడు. బాధితురాలు బంధువుల సహాయంతో డేవిడ్‌ను సంప్రదించినా స్పందించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువజనోత్సవ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యువజనోత్సవ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం-వ్యక్తిగత పోటీలో విద్యార్థిని కె. నాగమల్లీశ్వరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. పోస్టర్ మేకింగ్, బృందగానం, సోలో గీతాలాపన విభాగాల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలు దక్కినట్లు తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మల్లీశ్వరిని ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com